ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

సోమవారం 1 సెప్టెంబరు 2025



- బీసీ బిల్లుతో రిజర్వేషన్లు సుగమం
- బీసీ ఆశావహుల్లో ఉత్సాహం
- వరుసగా స్థానిక సంస్థ ఎన్నికలు
- మొదట పంచాయతీ.. తర్వాత పరిషత్
- జిల్లాలో 260 సర్పంచులు, 2268 వార్డులు సభ్యులు
- 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలు

'లోకల్' పోరు..



(ఆంధ్రజ్యోతి, సిరిసిల)

లోకల్ పోరుకు ప్రభుత్వం చకచకగా ముందుకు పోతోంది. ఆదివారం శాసనసభలో బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. దీంతోపాటు పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణకు ఆమోదం లభించడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీసీ ఆశావహుల్లో ఉత్సాహం పెరిగింది. సెప్టెంబర్‌లోనే ఎన్నికల నిర్వహణకు క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడంతో గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామపంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదట పంచాయతీ ఎన్నికలు అదే వరుసలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలు కూడా జరగనుండడంతో రాజకీయ పార్టీల్లో హడావుడి మొదలైంది.

● జిల్లాలో బీసీల ఆధిపత్యం..

స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ బిల్లు ఆమోదం లభించడంతో రాజన్నసిరిసిల్ల జిల్లాలో బీసీలఆధిపత్యం స్థానికసంస్థల్లో పెరుగుతుందని భావిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో బీసీలు తమ ఉనికి చాటుకోనున్నారు. 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లతో పాటు జనరల్ స్థానాల్లో ఎక్కువ సంఖ్యలో బీసీలు గెలుపొందారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామపంచాయతీ, జడ్పీటీసీలు, ఎంపీటీసీల జనరల్ స్థానాల్లో 42 మంది బీసీలు గెలుపొందారు. 2019 ఎన్నికల్లో 12 జడ్పీటీసీ స్థానాల్లో ఒకటి ఎస్టీ మహిళ, ఒకటి ఎస్సీ మహిళ, రెండు ఎస్సీ జనరల్, ఒకటి బీసీ మహిళ, ఒకటి బీసీ జనరల్, మూడు జనరల్ మహిళ, మరో మూడు జనరల్‌కు కేటాయించారు. రిజర్వేషన్ల ప్రకారం ఆరు మహిళలకు, ఆరు జనరల్‌గా ఉన్నాయి. 123 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 68 మహిళలకు, 58 జనరల్‌కు కేటాయించారు. ఇందులో ఎస్టీలకు ఆరు కేటాయించగా, 5 మహిళలకు, ఒకటి జనరల్‌గా ఉంది. 28 ఎస్సీలకు కేటాయించగా, 17 మహిళలకు, 11 జనరల్, 25 బీసీలకు కేటాయించగా, 14 మహిళలకు, 11 జనరల్ స్థానాలుగా ఉన్నాయి. 64జనరల్ స్థానాలు ఉండగా, 29 మహిళలకు, 25 జనరల్‌గా కేటాయించారు. ఈసారి రిజర్వేషన్లు మార్పు ఏలా ఉంటుందనే చర్చ కొనసాగుతోంది. జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉండగా, 252 గ్రామాపంచాయతీలకు ఎన్నికలు జరిగాయి.

● రేపు పంచాయతీ తుది ఓటర్ జాబితా

స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకమైన ఓటర్ జాబితాలు సిద్ధమవు తున్నాయి. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇప్పటికే డ్రాఫ్ట్ ఓటర్ జాబితా వెల్లడించి అభ్యంతరాలను స్వీకరించారు. ఆదివారం వాటిని పరిష్కరించి ఓటరు జాబితాలో అవసరమయ్యే సవరణలను చేసి సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితాను వెల్లడించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామపంచాయతీలో 3,52,134 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. ఇదే క్రమంలో జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల నిర్వహణకు చేస్తున్న సన్నాహాల్లో భాగంగా సెప్టెంబర్ 6న ఓటర్లు, పోలింగ్ కేంద్రాల నోటిఫికేషన్ వెల్లడిస్తారు. 8వ తేదీ వరకు అభ్యం తరాలు స్వీకరిస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహి స్తారు. 9న అభ్యంతరాలు పరిష్కరించి. 10న తుది ఓటరు జాబితాను వెల్లడిస్తారు.

252 సర్పంచ్ స్థానాల్లో బీసీలకు 56 స్థానాలు, ఎస్సీలకు 51 స్థానాలు, ఎస్టీలకు 30 స్థానాలు, జనరల్ 115 స్థానాలు రిజర్వ్ చేశారు. వీటిలో బీసీ రిజర్వేషన్ 80 స్థానాలు కలుపుకొని జనరల్ స్థానాల్లో 24 గెలుపొందారు.

● ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 260గ్రామపంచాయతీ ఉండగా, 2268 వార్డులు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 3,52,134మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చి గ్రామాల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రదర్శించారు. గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాలను రూపొందించే క్రమం లో ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండే విధంగా సవరించారు. మృతిచెందిన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించారు. కొత్త ఓటర్లను జాబితాలో చేర్చారు. అధికారులు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జిల్లాలో 200మంది ఓటర్లు ఉన్న గ్రామల్లో 1734 పోలింగ్ కేంద్రాలు, 400ఓటర్ల వరకు 468 పోలింగ్ కేంద్రాలు, 650ఓటర్ల వరకు ఉన్న పంచాయతీల్లో 76పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. పంచాయతీ ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. 260 సర్పం చ్‌లు, 2268 వార్డులకు ఎన్నికల నిర్వహణకు

- మిగతా 8లో

వరద బాధితులకు రూ.10లక్షల ఆర్థిక సాయం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో అకాల వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడానికి ఎంపీ నిధుల నుంచి రూ 10లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆదివారం ప్రకటించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు ఇచ్చిన పిలుపు మేరకు స్పందించి జిల్లాలో నష్టపోయిన ప్రజలందరినీ ఆదుకునేందుకు ఎంపీ నిధులనుంచి రూ.10లక్షలను త్వరలోనే కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అకాల వర్షాలతో సిరిసిల్లజిల్లాలో భారీ ఎత్తున నష్టం సంభవించిందన్నారు. రైతులకు పెద్దఎత్తున పంట నష్టం సంభవించిందని పలువురు నిరాశ్రయులయ్యారని అన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ నిధుల నుంచి సిరిసిల్ల జిల్లా బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్‌తో ఖర్చు చేస్తారని బండి సంజయ్‌కుమార్ తెలిపారు.

విజయవంతంగా నలుగురికి మోకాలు కీళ్ల మార్పిడి

వేములవాడ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మరో నలుగురు వ్యక్తులకు మోకాలు కీళు మార్పిడి ఆపరేషన్‌లను విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆదివారం నలుగురికి ఆపరేషన్‌లు చేపట్టారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు 48 మందికి మోకాలు ఆపరేషన్‌లు చేసినట్లు తెలిపారు. వేములవాడ ప్రాంత ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు మోకాలు కీలు మార్పిడి ఆపరేషన్‌ల కోసం వస్తున్నారని, ఇప్పటికి వంద మంది ఆపరేషన్‌ల కోసం లైన్‌లో ఉన్నారన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో ప్రతి ఆదివారం మోకాలు కీళ్ళ మార్పి ఆపరేషన్‌లు నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏరియా ఆసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు, అల్ట్రా సౌండ్స్ సేవలు, ఎక్స్‌రేతో పాటు రక్త పరీక్షలు, కంటి ఆపరేషన్‌లు, సాధారణ శస్త్ర చికిత్సలు, గర్భిణులకు సాధారణ కాన్పులు, ఆపరేషన్‌లు, గర్భసంచి ఆపరేషన్‌లు, ఆర్థోపెడిక్ సేవలు అందిస్తున్నామని వివరించారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మట్టి వినాయలకులనే పూజిద్దాం అని ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అన్నారపు వేణుగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు తంగళ్ళపల్లి మండపం టెక్స్‌టైల్ పార్కులో పర్యావరణ పరిక్షణలో భాగంగా మండపాల నిర్వాహకులు మట్టి వినాయకులను ఏర్పాటు చేయగా ఆదివారం ప్రేరణ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మండపాల వద్ద నిర్వాహకులకు ప్రశంస పత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణం మెహర్‌నగర్, టెక్స్‌టైల్ పార్కులో మండపాల నిర్వాహకులు పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకుల ప్రతిమలకు పూజలను నిర్వహించడం సమాజానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణను కాపాడుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ సభ్యులు బూర సతీష్, మేనేని హరీష్, ఎల్లండి సాయికృష్ణ, నీలి సంతోష్ పాల్గొన్నారు.

సుద్దాలలో యువత రాజకీయాలపై చర్చా వేదిక

కోనరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికలు యువకుల పాత్ర అనే అంశంపై సుద్దాల గ్రామ యువత ఆదివారం చర్చావేదికను నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. యువకులు దొబ్బల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయాల్లో యువకుల పాత్ర, గ్రామాల అభివృద్ధి, ఎన్నికల్లో ప్రలోబాలకు లొంగకుండా యువతను సిద్ధంచేయడం వంటి అంశాలపై చర్చించామన్నారు. ఈ సమావేశంలో ఎర్రబెల్లి నాగరాజు, కచ్చకాయల మహేష్, మాసం సుమన్, దిలీప్, జనార్ధన్, నాగరాజు, రంజిత్, కిషన్, రవితేజ, ప్రశాంత్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మధు, ఊరడి ప్రశాంత్, వెంకటేష్, అనిల్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

చిచ్చు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇంచార్జి బానోతు నరేష్ నాయక్ అన్నారు. కోనరావుపేటలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో సామరస్యంగా జీవిస్తున్న గిరిజన తెగలమధ్య ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు చిచ్చు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే సాంప్రదాయం, ఒకే జీవన విధానం ఉన్న తెగలను వేరుచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. వారిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్, రాజు నాయక్, ప్రకాష్ నాయక్, తిరుపతి, గణేష్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

వేములవాడ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 1975-76 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు 49 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఉదయాన్నే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభ ప్రాంగణానికి చేరుకున్న పూర్వవిద్యార్థులు ఒక్కరిని ఒకరు పలకరించుకున్నారు. గత స్మృతులను గుర్తుచేసుకుని సందడిగా గడిపారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధు నేర్పిన గురువును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కూర దేవేందర్ (అమర్), రేగుల దేవేందర్, వారాల దేవయ్యతో పాటు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు స్పందన



జిల్లా స్థాయి పోటీలో విజేతలైన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : యోగా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలలోని శ్రీ సత్యసాయి సేవా మందిరం ఆవరణలో జిల్లా స్థాయి యోగా(సీనియర్స్) పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్‌తోపాటు మెరిట్ సర్టిఫికెట్లను యోగా జిల్లా అసోసియేషన్ సభ్యులు అందించి అభినందించారు. ఈసందర్భంగా యోగా జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ మాట్లాడారు. జిల్లా స్థాయి యోగా పోటీలు 18నుంచి 45ఏళ్లలోపు క్రీడాకారుల మధ్య వివిధ విభాగాల్లో పోటీలు జరిగాయన్నారు. పోటీలలో విజేతలైన క్రీడాకారులను సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ సభ్యులు, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిల్ ర్యాలీ పోటీలు



సిరిసిల్లలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిల్ ర్యాలీ పోటీలు జరిగాయి. ముందుగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ సైకిల్ ర్యాలీ పోటీలకు జెండా ఊపి ప్రారంభించారు. అనంతం మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విజేతలకు ట్రోఫీలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ సిబ్బంది, విద్యా ర్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

తంగళ్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి,తంగళ్లపల్లి ఎస్సై ఉపేంద్రచారి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నిమజ్జనానికి తరలిన గణనాథుడు..



రాచర్లగొల్లపల్లిలో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న రెడ్డబోయిన గోపి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో శివకేశవస్వామి ఆలయ కమిటీ, యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన వేడుకలను ఆదివారం రాత్రి నిర్వహించారు. ప్రత్యేక వాహనాల్లో ఆది దేవుడిని పురవీధుల గుండా ఊరేగించారు. భక్తజనం మంగళహారతులు సమర్పించారు. రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లిలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, తదితరులు నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. వీడ్కోలు వినాయక అంటూ సెలవు పలికారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, గణేశ్, నరేశ్, లక్ష్మారెడ్డి, సత్యంరెడ్డి, కిరణ్‌నాయక్, శ్రీకాంత్, రమేశ్, భీమేశ్వర్, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, కిషన్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, మండల కేంద్రంలోని మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి సిరిసిల్ల పట్టణంలోని జగద్గురు ఆదిశంకరచార్య భజన మండలి సభ్యులు భజన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తి పాటలతో అలరించారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు రాపల్లి దేవాంతం, ప్రధానకార్యదర్శి వనం రమేశ్, ఉపాధ్యక్షులు శ్రీరాం సుదర్శన్, గోస్కె దేవదాస్, సంయుక్త కార్యదర్శి రాపల్లి అంబదాస్, యూత్ అధ్యక్షుడు సుంకి భాస్కర్, ప్రధానకార్యదర్శి సుంకి విష్ణు, సోషల్ మీడియా ఇన్‌చార్జి దోమల భాస్కర్, డైవశెట్టి సుంకి వేణు, జిల్లా ఉపాధ్యక్షుడు పోతు ఆంజనేయులు, భజన మండలి బృందం సభ్యులు పత్తిపాక వాసుదేవ్, పల్ల బాలరాజు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



సిరిసిల్లలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



వేములవాడలో దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు సిద్ధం కాగా, పోలీసులు పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షురాలు పూర్ణిమ, తంగళ్లపల్లి మండల అధ్యక్షురాలు భవిత, బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శి కొండ నరేష్, ఎస్టీసెల్ పట్టణ శాఖ అధ్యక్షుడు మొగిలిరాజు, జిల్లా వాణిజ్య సెల్ కో-కన్వీనర్ వంగా దేవేందర్‌రెడ్డి, మోర శ్రీహరి, సిద్దిదేవరాజు, రాహుల్, ప్రతాప్, బండారి వెంకన్న, పల్లికొండ నర్సయ్య పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా మండల బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనానికి యత్నించారు. వేములవాడ అర్బన్ మండల బీజేపీ అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు నందికమాన్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను తీసుకువచ్చి దహనం చేసేందుకు యత్నించారు. దీంతో గమనించిన పోలీసులు వెంటనే దిష్టిబొమ్మను తీసుకుని అడ్డుకున్నారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వ వైఫల్యం

చందుర్తి ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా ప్రభుత్వం విఫలమైందని మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూరియా కొరత నివారించాలని రైతులు చేతులెత్తి కోరినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నదన్నారు. ఆగస్టు 12న సింగిల్‌విండో ఎదుట క్యూలో నిలబడి యూరియా కోసం ఆవేదన వ్యక్తం చేస్తే, కొంత మంది రాజకీయ నాయకులు, పాటు ఏడీవో ఎలాంటి యూరియా కొరతలేదని, రాజకీయ లబ్ధి కోసమని గొంతు చించుకొని మాటాడారని అన్నారు. రైతులను విభజించుకుంటూ టోకెన్ల పేరిట, టోపీ పెట్టినరన్నారు. ఇప్పటి వరకు యూరియా రాలేదన్నారు. దీనికి అధికారులు సమాధానం చెప్పాలన్నారు. పొలాలు నాటేసి రెండు నెలలు అవుతోందని, 50 నుంచి 55రోజుల్లో యూరియా పొటాషి వేస్తారన్నారు. ఇప్పటివరకు యూరియా అందించలేదన్నారు. రైతులకు వెంటనే యూరియా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుమ్మ అంజయ్య, ఏరెడ్డి రాజిరెడ్డి.లక్కర్సు మహేష్. దుద్దిళ్ల లచ్చిరెడ్డి, నల్మాసు రవీందర్ రెడ్డి, లింగాల నారాయణ, మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్'ను వీక్షించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

తంగళ్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ మన్ కీ బాత్ 125వ ఎపిసోడ్‌ను ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి వీక్షించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బీజేపీ జిల్లా నాయకుడు ఆసాని రామలింగ రెడ్డి ఇంటిలో బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెన్నమనేని శ్రీధర్ రావు, జిల్లా మీడియా కన్వీనర్ కాసుగంటి రాజురావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ జూకంటి అఖిల్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోలా అంజనేయులు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఆసాని లావణ్య, మండల ప్రధాన కార్యదర్శి ఇటుకల రాజు, ఉపాధ్యక్షులు ఆశిర్వాద్, బిజెపి సీనియర్ నాయకులు వంతడుపుల సుధాకర్, జిందం సంతోష్, కాళీచరణ్, నరేష్, సిరిసిల్ల వంశీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కోనరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివంగాలపల్లి గ్రామంలో ప్రధాన మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, గ్రామస్థులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కర్ బాలాజీ, గొట్టె రామచంద్రం, బైరగోని సురేష్ గౌడ్, పరుశురాం, జితేందర్, జింక వెంకటి, మోత్కు మోహన్, తిరుపతి, బాలరాజు, విట్టల్, శ్రీకాంత్, అనిల్, నరేష్, శ్రీధర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు

తంగళ్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని పలువురు ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టుచేశారు. లక్ష్మీ, భారతి, అఫీజా, వనిత, రజిత, లావణ్య తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

I, THAKUR VIJAYA GOPAL SINGH S/O. THAKUR JAGATHPAL SINGH, R/O.H.NO: 10-4-2/3, VARALAXMINAGAR, KARIMNAGAR. I CHANGED NAME AS "THAKUR VIJAY GOPAL SINGH" S/O. THAKUR JAGATHPAL SINGH.

AJK-17199

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లైయిమ్స్‌కు, దట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర : 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఒకరి మృతి

అంతర్గాం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం రైల్వే స్టేషన్‌లో ఒకటవ ప్లాట్‌ఫాం దగ్గర ఎగువవైపు పట్టాలపై ప్రమాదవశాత్తు తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి మాడిశెట్టి విజయ్‌కుమార్(64) ఆదివారం మృతి చెందాడు. జీఆర్‌పీ ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం అంతర్గాం మండల పరిధిలోని అక్బర్‌నగర్‌కు చెందిన విజయ్ కుమార్ కొన్నేళ్ళుగా మతిస్థిమితం కోల్పోయి రామగుండం రైల్వే స్టేషన్ పరిసరాల్లో తిరుగుతున్నాడు. ఆదివారం రామగుండం రైల్వే స్టేషన్ దగ్గర పట్టాల పై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టగా మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని సందర్శించిన జీఆర్‌పీ ఇన్‌చార్జి తిరుపతి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, ఒకకుమారుడు ఉన్నారు. మృతుడిబంధువుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● యువకుడి మృతి, నలుగురికి తీవ్రగాయాలు


తన్నీరు ప్రవీణ్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారావుపల్లె గ్రామశివారులో ఆదివారం రాత్రి రెండుద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతి చెందగా నలుగురు తీవ్రగాయాల పాలయ్యారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోనరావుపేట గ్రామానికి చెందిన తన్నీరు ప్రవీణ్(22) అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై అన్న కుమార్, వదిన సుమను కోరుట్లలో దింపడానికి గ్రామం నుంచి ముగ్గురు బయలు దేరారు. అదేగ్రామానికి చెందిన అంబటి శశాంత్, అంబటి వర్షిత్‌లు కోరుట్ల నుంచి కోనరావుపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో రామరావుపల్లె గ్రామశివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తన్నీరు ప్రవీణ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా తన్నీరు కుమార్, సుమ, అంబటి శశాంత్, అంబటి వర్షిత్‌లకు తీవ్రగాయాలపాలై రోడ్డుపై పడి ఉన్నవారిని స్థానికులు ప్రత్యేక వాహనంలో కోరుట్ల ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం గాయపడ్డ నలుగురిని జగిత్యాల ప్రభుత్వఆసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. తన్నీరు ప్రవీణ్ ఆరునెలల క్రితం గల్ఫ్ దేశం నుంచి వచ్చాడు. ప్రమాదంపై కోరుట్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ట్రాలీ బోల్తా..

● 15 మంది చిన్నారులకు గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆటో ట్రాలీ బోల్తాపడి 15 మంది చిన్నారులు గాయపడిన ఘటన ఆదివారం గోదావరిఖని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతన కాలనీలో చోటుచేసుకున్నది. పోతనకాలనీలో చిన్నారులు గణపతిని ప్రతిష్ఠించారు. ఆదివారం సెలవు కావడంతో 26మంది కలిసి క్రికెట్‌మ్యాచ్ ఆడడానికి ఆటో ట్రాలీ (కమర్షియల్ వాహనం)లో సింగరేణి స్కూల్ గ్రౌండ్‌కు వెళ్ళారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ట్రాలీలో పోతన కాలనీ చౌరస్తావద్ద మలుపు తిప్పుతుండగా అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో 15మంది గాయపడ్డారు. గాయపడిన వారు 6నుంచి తొమ్మిదవ తరగతివరకు చదువుతున్న విద్యార్థులు. ప్రమాద ఘటన తెలియగానే తల్లిదండ్రులు, స్థానికులు అక్కడకు చేరుకుని చిన్నారులను ఆసుపత్రులకు తరలించారు. ఒకేసారి15మంది ప్రమాదంలో గాయపడడంతో ఘటనాస్థలంలో చిన్నారులు, వారి తల్లిదండ్రుల ఏడుపులు, అరుపులతో పరిస్థితి గందరగోళంగా మారింది. స్వల్పంగా గాయపడిన వారిని ఆర్‌ఎంపీల వద్ద చికిత్స చేయించారు. 10 మందిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి, సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. చిన్నారుల తల, ముఖం, చేతులు, పక్కడెముకలు, కాళ్ళకు గాయాలయ్యాయి. కొందరికి పళ్ళు ఊడిపోయాయి. కాగాప్రాణహాని జరగకపోవడంతో అంతాఊపిరి పీల్చుకున్నారు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


నవీన్(ఫైల్)

ఇల్లంతకుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామానికి చెందిన జక్కుల నవీన్(30) అనే యువకుడు ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, అతడి అన్న రామచంద్రం గాయపడ్డాడు. దాచారం గ్రామానికి చెందిన బలరాం నెలరోజుల క్రితం మృతిచెందగా, అతడి కుమారులు నవీన్, రామచంద్రం ఆదివారం ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి నిద్రకు వెళుతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టడంతో నవీన్ అక్కడిక్కడే మృతిచెందాడు. అతడి అన్న హెల్మెట్ ధరించడం వల్ల గాయాలతో బయటపడ్డాడు.

11మంది పేకాటరాయుళ్ల అరెస్టు

జగిత్యాల క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌లో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై టౌన్‌సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 11మందిని పట్టుకున్నారు. వారి వద్ద రూ. 95,150 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్వేషకర పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కేసు

కోనరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గ్రూపులో విద్వేషకర పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన కురుకుంట్ల శ్రీనివాస్ అనే వ్యక్తి కోనరావుపేట సమాచారగ్రూప్‌లో హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా, మతపర విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా హిందూ దేవుళ్ళపై అసభ్యకరమైన పోస్టును పెట్టారని అన్నారు. ఈ మేరకు కోనరావుపేట బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కర్ బాలాజీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మంథనిరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్‌సమీపంలోని గాడుదులగండి మెయిన్‌రోడ్డుపైఆదివారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో మితి స్థిమితంలేని గుర్తుతెలియనివ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మృతిచెందిన వ్యక్తి తెల్ల గడ్డంతో నీలిరంగు చొక్కను ధరించి ఉన్నాడని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మృతదేహాన్ని మంథని ప్రభుత్వ మార్చురిలో భద్రపర్చినట్లు తెలిపారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం

గంగాధర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కొండన్నపల్లి స్టేజివద్ద భారీ వృక్షం రోడ్డుపై కూలింది. ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కరీంనగర్, నిజామాబాద్ ప్రధానరహదారి కావడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. విషయాన్ని స్థానికులు పోలీసులకు చేరవేయడంతో వెంటనే స్పందించిన ఎస్సై వంశీక్రిష్ణ సిబ్బందితో కూలిన చెట్టును కట్ చేయించి తొలగించారు. అనంతరం రాకపోకలు ప్రారంభమయ్యాయి.

భారీవర్షాలతో పత్తి రైతులకు భారీనష్టం

- ఎర్రబడిన ఆకులు.. కుళ్లిపోతున్న పత్తికాయలు
- పెట్టుబడులు వచ్చేలా లేవంటున్న రైతులు


గాలిపెల్లి గ్రామంలో భారీవర్షాలతో ఎర్రబడిన పత్తిచేను

ఇల్లంతకుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): లాభాల బాటపట్టిస్తుందని పతిపంటను సాగుచేసిన రైతులకు భారీవర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. మండలంలోని ఎక్కువ గ్రామాల్లో పతిపంటను సాగుచేయడానికే మొగ్గు చూపుతుంటారు. మండలంలో ఈ సంవత్సరం 12500ఎకరాలలో పత్తిపంటను సాగుచేశారు. తొలకరి వర్షాలకు ముందే పత్తివిత్తనాలు పెట్టిన రైతులు నష్టపోయారు. దీనితో వర్షాల తర్వాత రెండవ సారి పత్తివిత్తనాలు పెట్టడం వల్ల విత్తనాల ఖర్చు, కూలీల ఖర్చు అధికం అయ్యింది. విత్తనాలు మొలకెత్తిన అనంతరం వర్షాలు లేకపోవడంతో కొన్ని పత్తి మొలకలు ఎండిపోయాయి. తర్వాత చెట్టు ఏపుగా ఎదగడం చూసిన రైతులు ఈసారి పెట్టుబడులు పోగా కొంతనైన మిగలుతుందని ఆశపడ్డారు. నాలుగు రోజులపాటు కురిసిన భారీవర్షాలతో కేసన్నపల్లె, ఆరెపల్లి, ముస్కానిపేట, గాలిపెల్లి, పత్తికుంటపల్లె, తాళ్ళపెల్లి, నర్సక్కపేట తదితర గ్రామాలలో పత్తిచేనుల్లో నీరు నిలిచిపోయింది. ఏటవాలుగా ఉన్న భూముల్లో పత్తిపంట ఉన్న వారికి ఇబ్బంది బాగాలేకపోయినా సమాంతరంగా భూమి ఉన్న పత్తిరైతులకు తీవ్ర నష్టం జరిగింది.నీరు చేనులో నిలిచిపోవడం వల్ల పత్తిచెట్టు కింది కాయలు మురిగిపోయాయి. ఆకులు ఎర్రబడటంతో దిగుబడి బాగా తగ్గుతుందని, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తిచేనులో కింది కాయలు మురిగిపోతున్నాయి..



- వడిజె అనీల్‌కుమార్, రైతు, కేసన్నపల్లె

భారీవర్షాలతో చేనులో నీరు నిలిచిపోవడం వల్ల పత్తిచెట్టు కింది కాయలు మురిగిపోతున్నాయి. చెట్టు ఆకులు ఎర్రబడ్డాయి. నాలుగు ఎకరాలలో పత్తిపంటను సాగుచేయగా ఎకరం విస్తీర్ణంలో చేనుకు నష్టం జరిగింది. ఇప్పటికే ఎకరానికి రూ 25వేల వరకు ఖర్చు అయ్యింది. గతంలో కంటే ఖర్చులు ఎక్కువగా అయ్యాయి. పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనపించడం లేదు. మరోసారి భారీవర్షాలు పడితే పత్తిరైతులకు కోలుకునే పరిస్థితి ఉండదు. నష్టపోయిన పత్తిరైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

సూక్ష్మదాతు లోపాన్ని సరిచేసుకోవాలి..



- సురేష్‌రెడ్డి, వ్యవసాయాధికారి, ఇల్లంతకుంట

పత్తిరైతులు ప్రస్తుత పరిస్థితిలో సూక్ష్మదాతు లోపాన్ని సరిచేసుకోవాలి. అధిక వర్షాలతో చేనులో నీరు నిలువ ఉండటం వల్ల పత్తి ఆకులు ఎర్రబడ్డాయి. చేనులో మెగ్నీషియం దాతు లోపం ఉన్నందున మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటర్ నీటికి 5గ్రాముల చొప్పున వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసినట్లయితే దిగుబడి ఎక్కువపొందే అవకాశం ఉంది. వర్షం నీరు చేనులో నిలువ ఉండకుండా ఏర్పాటు చేసుకోవాలి.

మానేరు ప్రాంతం అస్తవ్యస్తం..


కోళ్లమద్ది వెళ్లే దారిలో దెబ్బతిన్న ప్రధాన రోడ్డు


మానేరు సమీపాన కోతకు గురైన బీటీ రోడ్డు

గంబీరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్ర జ్యోతి): గంబీరావుపేట మం డలం నర్మాల ఎగువ మానేరు ప్రాంతాన్ని వర్ష బీభత్సం అతలా కుతలం చే సింది. మానేరు మత్తడి దూకడం తగ్గుతున్న కొద్ది ఆ ప్రాంతం అస్తవ్యస్థంగా కనిపిస్తోంది. మానేరు- కోళ్ళమద్ది మధ్య ప్రధాన రహదారి ధ్వంసమైంది. రోడ్లన్నీ కోతకు గుర య్యాయి. తిరిగి ఈ మార్గం వెంట వాహనాలు నడవాలంటే కష్టంగా మారింది. ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని దుస్థితిలో రోడ్లు తయారయ్యాయి. పాలకులు, అధికారులు స్పందించి, మానేరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరారు.

● వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టాలి



- మల్లేశ్‌యాదవ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి

నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు ప్రాంతంలో రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో సిద్దిపేట.-కామారెడ్డి రవాణా సౌకర్యం నిలిచిపోయింది. అటు గంబీరావుపేట-లింగన్నపేట మధ్య మట్టి రోడ్డు వరదలకు కొట్టకుపోయింది. ఈ మార్గం రోడ్లన్నీ దెబ్బతినడంలో ప్రజలు నానా అవస్థలు పడుతు న్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.

కన్నతల్లిని పట్టించుకోని కొడుకులు

● పోలీసులకు ఫిర్యాదు

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నానా బూతులు తిడుతూ.. కొడుతున్నారని.. కన్న కొడుకుల నుంచి తనకు రక్షణ కల్పించి.. న్యాయం చేయాలని కోరుతూ ఓ తల్లి ముగ్గురు కొడుకులపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేసిన సంఘటన ఆదివారం హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. హుజూరాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు శనిగరపు లక్ష్మి కష్టపడి పెంచి పెద్దచేసిన కొడుకులు తనను సరిగా చూసుకోవడం లేదని, కనీసం భోజనం కూడా పెట్టకుండా మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. చిన్నకుమారుడు తనను చంపేందుకు ప్రయత్నించాడని, తనకు న్యాయం చేయాలని సీఐకు ఫిర్యాదుచేసింది. స్పందించిన సీఐ కరుణాకర్ వెంటనే ముగ్గురు కొడుకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిని బాధ్యతగా ప్రేమతో చూసుకోవాలని చెప్పి పంపించారు.

కక్షతోనే సవతి తల్లి హత్య

● 24 గంటల్లోపే నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
● వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి ఏసీపీ శ్రీనివాస్‌జీ


విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జీ ఏసీపీ శ్రీనివాస్‌జీ

ఇల్లందకుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కక్షపూరితంగానే సవతి తల్లి గొంతుకోసి హత్య చేశారని హుజూరాబాద్ ఇన్‌చార్జీ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. ఆదివారం జమ్మికుంటరూరల్ పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇల్లందకుంట మండలంలోని టేకుర్తి గ్రామానికిచెందిన ముద్రబోయిన రాములు ఒగ్గు కథ చెప్పుకుంటూ జీవిస్తున్నాడు. 20 ఏళ్ల క్రితం రాములుకు అదే మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన రేణుకతో వివాహం జరిగింది. వీరికి అభిలాష్, బన్నీతేజ అనేఇద్దరు కుమారులున్నారు. రాములు వృత్తిరిత్యా వరంగల్‌కు వెళ్తున్న క్రమంలో అక్కడే ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న చిగురు మామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన పెళ్లై భర్తతో వేరుగా ఉంటున్న ముద్రబోయిన తిరుమల(35)తో పరిచయం ఏర్పడింది. ఏడేళ్ల క్రితం రాములు తిరుమలను రెండో వివాహం చేసుకొని టేకుర్తి గ్రామంలోనే వేరే కాపురం పెట్టాడు. రాములు మొదటి భార్య, కుమారులు తిరుమలపై కక్ష పెంచుకొని ఆమెతో తరుచూ గొడవ పడుతుండే వారు. ఈ క్రమంలోనే తిరుమల గర్భవతి కాగా ప్రస్తుతం ఏడు నెలల గర్భవతిగా ఉంది. మొదటి నుంచి తిరుమలకు గర్భం రావడం ఇష్టంలేని రాములు, అప్పటికే తిరుమలపై కక్ష పెట్టుకున్న మొదటి భార్య, ఆమె కుమారులు తిరుమలను ఎలాగైనా చంపేయాలని నిర్ణయించుకున్నారు. రాములు చిన్న కుమారుడు బన్నీతేజను తిరుమలను చంపడానికి ప్రేరేపించారు. అదనుచూసి ఆమె ఒంటిరిగా ఉన్న సమయంలో ముందుగానే కొనుక్కున్న కత్తితో బన్నీతేజను పంపించి విచక్షణరహితంగా తిరుమల గొంతు కోసి, కత్తితో పొడిచి చంపేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న ఇల్లందకుంట పోలీసులు పారిపోతున్న నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచనున్నట్లు తెలిపారు. ఈ కేసులో నేరం జరిగిన తర్వాత అతి తక్కువ సమయంలో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న జమ్మికుంటరూరల్ సీఐ లక్ష్మినారాయణ, ఇల్లందకుంట ఎస్సై క్రాంతికుమార్‌ను ఇన్‌చార్జీ ఏసీపీ శ్రీనివాస్‌జీ అభినందించారు. సమావేశంలో సీఐలు రామకృష్ణ, వెంకట్, ఎస్సైలు సీహెచ్ తిరుపతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు స్కామ్‌ను ఛేదించిన పోలీసులు

- తాకట్టు బంగారం కొట్టేసి క్రికెట్ బెట్టింగ్
- 15.23కిలోల బంగారం, రూ.1.61లక్షల నగదు స్వాధీనం
- 44 మంది నిందితుల అరెస్టు..పరారీలో మరో ఇద్దరు


అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని చోరీచేసి ప్రైవేట్ బ్యాంక్‌లో తాకట్టుపెట్టిన కేసును రామగుండం పోలీసులు ఛేదించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐబ్యాంకులో ఖాతాదారులు అవసరాలకోసం 25కిలోల బంగారాన్ని తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్నారు. ఈకేసులో చెన్నూరు ఎస్‌బీఐలో క్యాషియర్‌గా పనిచేస్తున్న నరిగె రవీందర్, బ్యాంకు మేనేజర్ ఎన్నపురెడ్డి మనోహర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్, మరో 41మందిని ఆదివారం అరెస్టు చేయగా మరోముగ్గురు పరారీలో ఉన్నట్లు సీపీ అంబర్ కిశోర్‌ఝా తెలిపారు. వీరుప్రైవేట్ గోల్డ్ లోన్ సంస్థల్లో తాకట్టుపెట్టిన 15.23కిలోల బంగారం, 1.61 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

చెన్నూరు ఎస్‌బీఐ-2లో పనిచేస్తున్న క్యాషియర్ రవీందర్ 2024అక్టోబరుకు ముందు క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40లక్షలు పోగొట్టుకున్నాడు. ఈనష్టాన్ని పూడ్చుకోవడానికి మళ్లీబెట్టింగ్ కొనసాగించడానికి బ్యాంకు మేనే జర్ ఎన్నపురెడ్డి మనోహర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో చర్చించాడు. బ్యాంకులోని బంగారాన్ని బయటకు తీసుకువెళ్లి తాకట్టు పెట్టి రుణాలు తీసుకుందామని చెప్పాడు. దీనికి బ్యాంకు మేనేజర్ ఎన్నపు రెడ్డి మనోహర్ ఒప్పుకున్నాడు. బ్యాంకుకరెన్సీ చెస్ట్ తాళం చెవులు మేనేజర్ మనోహర్ వద్ద ఒకటి, క్యాషియర్ రవీందర్ వద్ద మరొకటి ఉండేవి. ఈ రెండు తాళం చెవులతోనే చెస్ట్ తాళం తీయవచ్చు. బ్యాంకు మేనేజర్ మనోహర్ తన వద్ద ఉన్న తాళం చెవిని రవీందర్‌కు అప్పజెప్పాడు. దీంతో అతడు సందీప్‌తోకలిసికలిసి బంగారం, నగదు దొంగిలించేందుకు పథకం రచించాడు. అక్టోబరు 2024నుంచి బంగారం తీసి ఎస్‌బీఎఫ్‌సీ గోల్డ్‌లోన్ సంస్థలో పని చేసే మంచిర్యాలకు చెందిన కొంగొండి ధీరజ్, కోదాటి రాజశేఖర్, బొల్లి కిషన్‌కు రవీందర్ ఇచ్చేవాడు. ఈ విధంగా 402గోల్డ్‌లోన్ ఖాతాల నుంచి 25.17కిలోల బంగారు ఆభరణాలను బ్యాంకుచెస్ట్‌నుంచి బయటకు తీశారు. వీటిని ఎస్‌బీఎఫ్‌సీఐ, ఇండెల్‌మనీ, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, గోదావరి అర్బన్‌బ్యాంకు, మణప్పురం గోల్డ్, ముత్తూట్ ఫిన్‌కార్, ముత్తూట్‌మినీ వంటి 10ప్రైవేట్ గోల్డ్‌కంపెనీల్లో తాకట్టుపెట్టారు. వచ్చిన సొమ్మును మొదట ధీరజ్, రాజశేఖర్, కిషన్ అకౌంట్లలో జమ చేసుకునేవారు. అనంతరం కమీషన్ తీసుకుని మిగతా సొమ్మును ఎస్‌బీఐ క్యాషియర్ నరిగెరవీందర్ అకౌంట్‌కు ట్రాన్స్ ఫర్ చేసేవారు.

● బంగారం తాకట్టు పెట్టిన సొమ్ముతో బెట్టింగ్

క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడిన ప్రధాన నిందితుడు రవీందర్ బ్యాంకులోని తాకట్టు బంగారం, నగదును కాజేసి, ఆ సొమ్ముతో స్కై247 యాప్‌లో క్రికెట్ బెట్టింగ్ పెట్టేవాడు. ఈయాప్ పూర్తిగా సైబర్ నేరస్థులకు చెందినది. ఇతడు బెట్టింగ్ పెట్టిన సొమ్మంతా విదేశాలకు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు.

● బ్యాంకు రీజినల్ మేనేజర్ ఫిర్యాదుతో వెలుగులోకి..

చెన్నూరు ఎస్‌బీఐలో ఆడిట్ సందర్భంగా ఈ వ్యవహారం బయట పడింది. బ్యాంకు రీజినల్‌మేనేజర్ రితేష్ గుప్తా ఫిర్యాదు మేరకు చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 23న కేసు నమోదైంది. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా బ్యాంకును పరిశీలించి కేసు విచారణ బాధ్యతను జైపూర్ ఏసీపీ ఆరె వెంకటేశ్వర్‌కు అప్పగించారు. దర్యాప్తు అధికారి ప్రత్యేక బృందా లతో తనిఖీ చేశారు. రవీందర్ అకౌంట్‌లో అనుమానాస్పద లావాదేవీలను గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. క్యాషియర్ రవీందర్, బ్యాంకు మేనేజర్ మనోహర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సందీప్‌తోపాటు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలకు చెందిన ఉద్యోగులు, మేనేజర్లు, బినామీ పేర్లతో చోరీ బంగారాన్ని తాకట్టు పెట్టిన మొత్తం 47 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

● టీమ్ వర్క్‌తో బంగారం రికవరీ

చెన్నూరు ఎస్‌బీఐలో 25కిలోల తాకట్టు బంగారం, 1.1కోట్ల నగదును చోరీ చేసిన కేసును ఛేదించిన జైపూర్ ఏసీపీ ఆరె వెంకటేశ్వర్‌కు పోలీస్ శాఖలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఖాతాదారులకు చెందిన నగలను ఎలాంటి రశీదులు, ఆధారాలు లేకుండా కుదవ పెట్టుకున్న గోల్డ్‌లోన్ సంస్థలపై పోలీసులు చర్యలకు దిగారు. ఆ సంస్థల సిబ్బంది ప్రమేయం ఉన్నట్టు గుర్తించారు. కమీషన్లు తీసుకుని తాకట్టుపెట్టుకోవడంతో వాటి నుంచి రికవరీ చేశారు. బాధితుల్లో ఎక్కువ మంది చెన్నూరు పరిసర గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులు, చెన్నూరు పట్టణానికి చెందిన చిరు వ్యాపారులే ఉన్నారు. విచారణాధికారిగా వ్యవహరించిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌తో పాటు ఈ టీమ్‌లో భాగస్వామ్యులైన పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ భాస్కర్ అభినందించి రివార్డు అందజేశారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్టు


నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ, ఎస్సైలు

కాటారం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గంజాయిని రవాణాచేస్తున్న ముగ్గురుయువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి 3కిలోల335గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. కాటారం డీఎస్పీ అమరగాని సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం ఎడ్లపల్లి గ్రామపంచాయతీ పరిధి జంగిడిపల్లి రోడ్డుపై కొయ్యూరు ఎస్సై-2 రాజన్ పోలీస్‌సిబ్బందితో కలిసి శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తున్నారు. రెండు బైక్‌లపై ముగ్గురు యువకులు వస్తుండగా వారిని ఆపారు. ఆ యువకులు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వాహనాలను తనిఖీచేయగా 3కిలోల 335 గ్రాముల ఎండుగంజాయి ఉన్నప్యాకెట్లు లభ్యమయ్యాయి. పోలీసులు విచారించగా ఆ ముగ్గురు యువకులు పెద్దపల్లి జిల్లా 8ఇన్‌క్లైన్‌కాలనీ హనుమాన్‌నగర్‌కు చెందిన జంజర్ల రోహిత్, జంజర్ల బాలాజీ, కట్కూరి రుత్విక్‌గా తేలింది. రోహిత్, బాలాజీ కూలి పనులు చేస్తుండగా రుత్విక్ బీటెక్ చదువుతున్నాడు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కలిమెల మండలం పేటల్ గ్రామానికి చెందిన బుజ్జి అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొని రవాణా చేస్తున్నట్టు యువకులు అంగీకరించారు. వారిని కొయ్యూర్ ఎస్సై నరేష్ అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారని డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. నిందితుల నుంచి గంజాయి తోపాటు రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో కాటారం సీఐ నాగార్జునరావు, కొయ్యూరు ఎస్సై నరేష్, ఎస్సై-2 రాజన్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్


కరీంనగర్‌లో మహిళకు బ్యాగును అప్పగిస్తున్న ఆటో డ్రైవర్ కనకం రాజేందర్

తిమ్మాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన కనకం రాజేందర్ అనే ఆటోడ్రైవర్ తనకు దొరికిన బ్యాగును సంబంధిత యజమానికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. పోలంపల్లికి చెందిన రాజేందర్ ఆదివారం కరీంనగర్‌లో ఆటో నడుపుకుంటు ఉంటుండగా గీతాభవన్ వద్ద ఓ మహిళ ఆటోలో ఎక్కింది. చేరాల్సిన చోటుకు చేరిన ఆమే దిగిన ఆటో నుంచి దిగిన ఆమె తన బ్యాగును ఆటోలోనే మర్చిపోయింది. అయితే రాజేందర్ తిరిగి వస్తున్న క్రమంలో ఆటోలో బ్యాగును గుర్తించి వెంటనే ఆ మహిళ దిగిన స్థలానికి వెళ్లి బ్యాగును ఆ మహిళకు అందించాడు. ఆ బ్యాగులో సుమారు 4తులాల నగలతో పాటు కొంత నగదు ఉంది. తన కుటుంబ సభ్యుల చికిత్స కోసం నగలను తాకట్టు పెట్టేందుకు వెళుతున్న మహిళకు బ్యాగు కనింపచకపోయేసరికి కన్నీరు మున్నీరైంది. అయితే ఆటో డ్రైవర్ రాజేందర్ బ్యాగును తీసుకొని వచ్చి ఇవ్వడంతో ఆమె సంతోషానికి అవదులు లేకుండా పోయాయి. బ్యాగును నిజాయితీగా తీసుకు వచ్చి అప్పగించిన ఆటోడ్రైవర్ రాజేందర్‌ను మహిళతో పాటు వారి కుటుంబసభ్యులు అభినందించారు.



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

» నాపై 181 కేసులు బనాయించారు
» ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
» చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
» 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
» 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పు డు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

» 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
» 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
» కేరళలో పాంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సావానికి హాజరు



విద్యార్థినికి పాంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్ల నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పాంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు నగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ఆర్చరీ క్రీడాకారిణి చికితకు సన్మానం



చికితను సన్మానిస్తున్న పద్మనాయక వెలమ సంఘం నాయకులు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కెనెడాలోని విన్నిపెగ్‌లో ఇటీవల నిర్వహించిన ప్రపంచఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో ఇండియా తరపున స్వర్ణపతకాన్ని సాధించిన క్రీడాకారిణి చికితను కరీంనగర్ పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్యాలయంలో సన్మానించారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన తానిపర్తి చికిత ఇంతటి గొప్ప విజయం సాధించడం తెలంగాణకే గర్వకారణమన్నారు. విశ్వవేదికపైన దేశపతాకాన్ని రెపరెపలాడిస్తున్న చికితను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి జి.ప్రకాష్ రావు, గంద్ర సంపత్‌రావు, బోయినపల్లి భూపతిరావు, నిమ్మనేని భీంరావు, సుంకిశాల సంపత్‌రావు, జూపల్లి మాధవరావు, జోగినిపల్లి రఘునందన్‌రావు, చీటి ప్రతాప్‌రావు పాల్గొన్నారు.

నాటి విదార్థులే.. నేటి ఉపాధ్యాయులు



ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

జమ్మికుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలురఉన్నతపాఠశాలలో ఒకప్పుడు చదువుకున్న విద్యార్థులే నేడు ఉపాధ్యాయులుగా వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. రాం రాజయ్య, బొడిగల సమ్మయ్య, కట్కూరి వెంకట్‌రెడ్డి, కొలుగూరి సంపత్, మ్యాకమళ్ల శ్రీనివాస్, వట్టిపల్లి ప్రకాష్, సంతోష్ ఇదే పాఠశాలలో గతంలో చదువుకున్నారు. వారంతా తాజాగా ఇదే పాఠశాలకు ఉపాధ్యాయులుగా వచ్చారు. వీరితోపాటు ప్రధానోపాధ్యాయుడిగా బదిలీపై వచ్చిన బాదం సురేష్ సైతం ఒకప్పటి ఇదే పాఠశాల విద్యార్థి కావడం విశేషం.

వర్షానికి పాక్షికంగా కూలిన ఇల్లు



కూలిన ఇల్లు

వెల్గటూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లికి చెందిన సంగెపుభాగ్యలక్ష్మికి చెందిన ఇల్లుపాక్షికంగా కూలింది. శనివారం రాత్రి భాగ్యలక్ష్మి కుటుంబం నిద్రిస్తున్న సమయంలో ఇల్లు ఒకవైపు కప్పు ఒక్కసారిగాకూలింది. ఆసమయంలో కింద ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. పేదరికంలో ఉన్న తమకు ఉన్న గూడుకూలడంతో ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం స్పం దించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బాధితురాలు కోరుతోంది.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

● 3,70,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ఆదివారం తగ్గింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,70,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 38గేట్లు ఎత్తి 3,00,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 69.57 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టు ఇన్‌ఫ్లో కొసాగుతుంది. ప్రాజెక్టుకు ఆదివారం 20,577క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా, ఇందులో ఎస్సారెస్పీనుంచి వరద కాలువద్వారా 13100క్యూసెక్కులు మానేరు, మూలవాగు ద్వారా 7477క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టులోకి నీటిప్రవాహం కొనసాగుతోంది. కాగా మిడ్‌మానేరు ప్రాజెక్టునుంచి ప్యాకేజీ10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 12800తరలిస్తున్నారు. ప్రాజె క్టు పూర్తిస్థాయి నీటిమట్టం318 మీటర్లకు ప్రస్తుతం 317.21 మీటర్లు ఉంది. నీటినిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 25.527టీఎంసీల మేరకు నీరునిల్వ ఉంది.

'అన్నపూర్ణ'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు నాలుగు పంపుల ద్వారా కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.62 టీఎంసీల నీరు నిల్వఉంది. మధ్యమానేరు ద్వారా 12800 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 9900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు

ఎల్ఎండీలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఎగువ కాకతీయ కాలువ నుంచి స్వల్పంగా నీటిఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్ఎండీ పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ఎగువ కాకతీయ కాలువ నుంచి 2600 క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 293క్యూసెక్కులు మొత్తం 2893 క్యూసెక్కుల నీరుఎల్ఎండీలోకి వస్తోంది. దీంతో ప్రస్తుతం 21.223 టీఎంసీలకి చేరింది. మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 293క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెలుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి

● ఆలయ ఏఈవో రమాదేవి



ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో శివకల్యాణంలో పాల్గొన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఈవో రమాదేవి అన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా కళాభవన్‌లో నిర్వహించే నిత్య పూజలను ఆదివారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌లోకి మార్చారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించిన ఈవో మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి కోసం కార్యక్రమాలను వేగంగా సాగుతున్నాయని అన్నారు. ఆలయ పరిసరాల్లోని ఓపెన్‌స్లాబ్‌లో నిత్య కళ్యాణం, చండీహోమం, సత్యనారాయణ స్వామి వ్రతం వంటి పూజలు నిర్వహించేందుకు అవసరమైన మార్పులు చేపట్టామని అన్నారు. శ్రీస్వామి వారికి నిత్య పూజలు నిర్వహించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం జరగకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్న భక్తులకు ఎక్కడ కడా ఇబ్బందులు తలేత్తవద్దని సూచించారు.

చంద్ర గ్రహణం సందర్భంగా 7న రాజన్న ఆలయం బంద్

● వచ్చే ఆదివారం 11.25గంటల నుంచి సోమవారం తెల్లవారు 3.45 వరకు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం చంద్రగ్రహణం సందర్భంగా సెప్టెంబరు 7వ తేది ఆదివారం ఉదయం 11.25 గంటల నుంచి సెప్టెంబరు 8వ తేది సోమవారం ఉదయం తెల్లవారు జామున ఉదయం 3.45 గంటల వరకు ఆలయ మూసివేయనున్నట్లు ఆలయాధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆదివారం ఉదయం శ్రీస్వామి వారికి నిర్వహించే పూజలు నిర్వహించిన తరువాత 11.25 గంటలకు ఆలయం మూసివేసి మర్నాడు ఉదయం 3.45గంటలకు ఉదయం సంప్రోక్షణ అనంతరం ప్రాతఃకాల పూజలు జరిపి భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు.

అంజన్న ఆలయం మూసివేత

మల్యాల: చంద్రగ్రహణం దృష్ట్యా సెప్టెంబరు 7న కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు7 ఆదివారం మధ్యాహ్నం 12.30గంటలకు స్వామి వారికి నివేదన అనంతరం దేవాలయ ద్వార బంధనం చేస్తామని తెలిపారు. ద్వార బంధనంనకు అరగంట ముందు నుంచే అన్ని రకాల ఆర్జిత సేవలు ఉండవని తెలిపారు. సెప్టెంబరు 8 సోమవారం ఆలయంలో వేకువజామున పుణ్యాహవచనం, సంప్రోక్షణ, తిరుమంజనం, ఆరాధన పూజలు జరిపిస్తామని వివరించారు. అనంతరం ఉదయం ఏడు గంటల నుంచి ఆలయం తెరచి యథావిధిగా దర్శనాలు, ఆర్జితసేవలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు గమనించాలని కోరారు.

ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెంపునకు జేవీవీ కృషి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శాస్త్రప్రచారంలో, ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెంచేందుకు జన విజ్ఞాన వేదిక కృషిచేస్తోందని ప్రొఫెసర్ బీఎస్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఫిలింభవన్‌లో జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ప్రజాసైన్స్ ఉద్యమశిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ప్రత్యేకశ్రద్ధ తీసుకుని జిల్లాలోని పాఠశాలలన్నింటికీ చెకుముకి పత్రికను పంపించే ఏర్పాట్లు చేశారని, ఆ పత్రికను విద్యార్థులు చదవడంతో శాస్త్రీయ దృక్పథం ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. అనంతరం శాస్త్రం, శాస్త్ర ప్రచారం-సవాళ్లు అనే అంశంపై ప్రొఫెసర్ రామచంద్రయ్య పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ప్రజాసైన్స్ ఉద్యమం, తాత్వికత, చరిత్ర, అనుభవాలు అనే అంశంపై జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, జేవీవీ కార్యక్రమాలు, పర్యావరణ స్పృహ అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఆర్ వెంకటేశ్వర్ రావు, కె.శంకర్, జి అశోక్, సి రామరాజు, ఎస్ దేవేందర్ పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థులపై ఎలుకల దాడులు

హుజూరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ సంక్షేమహాస్టళ్లలో విద్యార్థులపై ఎలుకల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఆదివారం హుజూరాబాద్ పట్టణం కేసీ క్యాంపులోని మహాత్మాజ్యోతిబాఫూలే సంక్షేమగురుకుల పాఠశాలలో 8వతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను ఎలుకలు కొరికాయి. గమనించిన ప్రిన్సిపాల్ హుటాహుటిన విద్యార్థులను ఆస్పత్రికి తరలించి వైద్యంఅందించారు. నెలరోజుల క్రితం హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్‌రోడ్‌లో నిర్వహిస్తున్న సైదాపూర్ మహాత్మాజ్యోతిబాఫూలే హాస్టల్‌లో విద్యార్థులపై ఎలుకలు కరిచిన విషయం విదితమే. ఈ విషయం మరవకముందే ఇది జరగడం విశేషం.

తెలుగు తేజం పురస్కారం అందుకున్న యువ కవి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ పరిధిలోని బాకుపల్లికి చెందిన యువకవి కట్ల శ్రీనివాస్ తెలుగు తేజం పురస్కారం ఆదివారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఓ ఫంక్షన్ హాలులో అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న శ్రీనివాస్‌ను సంస్థ గుర్తించి పురస్కారం అందించింది. సంస్థ చైర్మన్ ప్రతాప్, జాతీయ అధ్యక్షుడు ఈశ్వరీ భూషణం, కార్యదర్శి పార్థసారధి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. యువ కవి శ్రీనివాస్ పురస్కారం అందుకోవడం పట్ల తాజా, మాజీ సర్పంచ్ రవీందర్, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న యువ కవి శ్రీనివాస్

'లోకల్' పోరు..

(5వ పేజీ తరువాయి)

అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచారు. సర్పంచ్ ఎన్నికలకు పెద్ద బాక్సులు, వార్డు సభ్యులకు చిన్న బ్యాలెట్ బాక్సులు జిల్లాకు వచ్చాయి. జిల్లాలో పోలింగ్‌స్టేషన్ల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అంతకుమించి ఓటర్లు ఉంటే రెండో పోలింగ్‌కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200మంది ఓటర్లు ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి ఇద్దరుపోలింగ్ అధికారులు, 401నుంచి 650 వరకు ఉంటే ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. బోయినపల్లి, చందుర్తి, ఇల్లంతకుంట, గంభీరావుపేట, కోనరావుపేట, ముస్తాబాద్, రుద్రంగి, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, వేములవాడఅర్బన్, ఎల్లారెడ్డిపేట జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాల్లో బోయినపల్లి మండలంలో 11స్థానాలు, చందుర్తిలో 10, ఇల్లంతకుంటలో14, గంభీరావుపేటలో 13, కోనరావుపేటలో12, ముస్తాబాద్‌లో 13, రుద్రంగిలో 5, తంగళ్లపల్లిలో 14, వీర్నపల్లిలో5, వేములవాడ రూరల్‌లో 7, వేములవాడ అర్బన్‌లో 6, ఎల్లారెడ్డిపేటలో 13 స్థానాలున్నాయి. వీటికి సంబంధించిన ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది నియామకాలకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో 709పోలింగ్ కేంద్రాలు, 3700 మంది పోలింగ్ సిబ్బందిని ఇప్పటికే గుర్తించారు.

ఆశా వర్కర్లను నిర్బంధించడం దుర్మార్గం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నామని, తమది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న ఆశా వర్కర్‌లను నిర్బందించడం దుర్మార్గమని సీఐటీయూజిల్లా కార్యదర్శి కోడం రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్‌లు తమ హక్కుల కోసం సెప్టెంబర్1న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పోతారనే నేపంతో ఆశాలను ఆదివారం పోలీస్ స్టేషన్‌లకు తీసుకొచ్చి హైదరాబద్‌కు పోమని లేటర్‌లు రాయించుకుని సంతకాలు పెట్టించుకుంటూ భయభ్రాంతులకు గురిచేయడం సరైందికాదన్నారు. అక్రమ అరెస్ట్‌లు, నిర్భాంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. ప్రభుత్వానికి ఆశావర్కర్‌లంటే అంత భయం ఉంటే వెంటనే వారి సమస్యలతో పాటు డిమాండ్‌లను పరిష్కరించాలని అలాగే వారికి ప్రతినెల రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలన్నారు. పనిభారం తగ్గించి పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. ఆశావర్కర్‌లు పనిచేయడం లేదని పారితోషికాలు తగ్గించాలనే వ్యతిరేక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రతలు కల్పించాలన్నారు. 2021జూలై నుంచి డిసెంబర్ వరకు 6నెలల పీఆర్‌సీ, ఏరియల్స్ వెంటనే చెల్లించాలన్నారు. ఏఎన్ఎం, జీఎస్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ఏఎన్ఎం, జీఎస్ఎం పోస్ట్‌లలో డైరెక్ట్‌గా పదోన్నతులు కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, విమల పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు.. వాహనదారులకు తిప్పలు



ఎల్లారెడ్డిపేటలో పాత బస్టాండు ప్రాంతంలో..



ఎల్లారెడ్డిపేటలో సిరిసిల్ల- కామారెడ్డి రహదారిపై..



రుద్రంగి తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వెంకటాపూర్ శివారు నుంచి గంభీరావుపేట మండల సరిహద్దు గ్రామమైన తిమ్మాపూర్ వరకు ఉన్న కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. అడుగుకో గుంతలా తయారవడంతో వాహనాలు అదుపుతప్పుతున్నాయి. పలువురు ప్రయాణీకులు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర, రాగట్లపల్లి, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్ గ్రామాల బస్టాండు ప్రాంతాల్లో భారీ గుంతలు వాహనదారులకు సమస్యగా మారాయి. ప్రమాదాలతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయి.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు గుంతలను పూడ్చివేసేందుకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

● రుద్రంగి : ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంతో పాటు రెవన్యూ కార్యాలయం ముందు రోడ్డు గుంతలు పడి బురదమయంగా మారింది. కొన్ని నెలలుగా ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు వస్తున్నాయి. బస్టాండ్‌లో సరైన వసతులు అధికారులు కల్పించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వర్షాలకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో గుంతలు ఏర్పడి బురదమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



రుద్రంగి బస్టాండ్..

కుంకుమ పూజలు.. అన్నదానాలు..



ఎల్లారెడ్డిపేటలో ఏర్పాటు చేసిన భారీ వినాయకులు



బోయినపల్లిలో..



గంభీరావుపేటలో..

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వినాయక మండపాల వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విభిన్న రూపాల్లో భారీగణనాథులు భక్తులకు దర్శనమిస్తున్నాయి. మహిళలు కుంకుమ పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో మంగళహారతులు సమర్పించి ఏకదంతుడికి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని దోస్త్ యూత్ సభ్యులు భక్తులకు దానిమ్మ మొక్కలను పంపిణీ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుల, యువజన సంఘాల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని పలు గణేష్ మండపాల వద్ద కుంకుమ పూజలను నిర్వహించారు. శివసాయి నగర్‌లోని గణేష్ మండపం వద్దకు మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమ పూజలో పాల్గొన్నారు. బద్దిపోచమ్మ ఏరియాలోని రాజన్నయూత్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. సంకెపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద గణేష్ మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● బోయినపల్లి : మండల కేంద్రంలోని బోయినపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద స్కూల్ అడ్డా యూత్ ఆధ్వర్యంతోపాటు రత్నంపేటలో హనుమాన్ శివ సమేత ఆకాయంలో ప్రతిష్ఠించిన వినాయక మండపాల ఎదుట ఆదివారం మహిళలు కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎదులపురం రాజేంద్రప్రసాద్, కొడగాని వెంకటేష్, ల్యద రాము, దూరిశెట్టి శ్రీనివాస్, గురజాల కోటి, కొడగాని తిరుపతి, అశోక్ , మెట్ట బాబు, గొండ ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినాయకుడి వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండపం వద్ద లక్ష్మి గణపతి హోమం. సాముహిక కుంకుమ పూజ, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో పద్మాశాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు గూడూరు భరత్, లక్ష్మీనారాయణ, కిషన్, నందం, శ్రీకాంత్, శంకర్, పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాల్లోని వినాయక మండపాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. వల్లంపట్ల గ్రామంలో చిన్నారులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గ్రామసమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, నాయకులు చిట్టి ప్రదీప్‌రెడ్డి, తిప్పారపు రమేష్, నాగరాజు, సాదుల నిరంజన్, దయ్యాల రామకృష్ణ, మామిడి శ్రీనివాస్, హరికుమార్, బాబు, దేవయ్య, చంద్రం, అజయ్, బొల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : గణనాథుని మండపాల్లో కుంకుమ పూజలు, అన్నదానాలు నిర్వహించారు. ధర్మారం, సుద్దాల తదితర గ్రామాల్లో కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుద్దాలలో మండపంలో ఏఎస్ఐ లక్ష్మణ్ దంపతులు గణనాథుని దర్శించుకోగా మండపం నిర్వాహకులు వారిని సన్మానించారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో ఆదివారం సాయినగర్ కాలని, హనుమా న్ యూత్, పటేల్స్‌యూత్ గణపతుల వద్ద మహాఅన్నదానం ఏర్పాటుచేశారు. అలాగే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వ హించారు. మమ లక్ష్మి కాలనిలోని గణపతి వద్ద 108 నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, నాయకులు, నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



రుద్రంగిలో గణపతికి 108 నైవేద్యాలు



వేములవాడ శివసాయినగర్‌లో..



వేములవాడ రాజన్న యూత్ ఆధ్వర్యంలో..



రుద్రంగిలో..

యూరియా కోసం రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

కోనరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిజామాబాద్ గ్రామ రైతులు సరిపడా యూరియా ఇవ్వాలని కోరుతూ ఆదివారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రశాంత్‌రెడ్డి చేరుకొని రైతులతో మాట్లాడారు. అయినా వినకపోవడంతో వ్యవసాయ అధికారి సందీప్ కుమార్ ధర్నా చేస్తున్న రైతుల వద్దకు వచ్చి యూరియా స్టాక్ ఉందని, సరిపడా ఇప్పిస్తానని తెలుపడంతో రైతులు ఆందోళన విరమించారు.

వాగు దాటాలంటే ఇబ్బందులు..



మామిడిపల్లి వద్ద ఉప్పొంగుతున్న మూలవాగు

కోనరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వాగు వస్తే దాటరాని పల్లెలు, వ్యవసాయం చేసుకోవడానికి రైతులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి నుంచి వేములవాడ మండలం హన్మాజీపేట వరకు మూలవాగు పారడంతో మామిడిపల్లి, నిజామాబాద్, వెంకట్రావుపేట, బావుసాయిపేట, మట్టిమల్ల, నిమ్మపల్లి గ్రామాల రాకపోకలు బంద్ అవుతున్నాయి. పొలాల వద్దకు వెళ్లడానికి కూడా రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అప్పటి మంత్రి జీవన్‌రెడ్డి, వేములవాడ ఆలయ చైర్మన్ ఆది శ్రీనివాస్ చొరవతో మూలవాగులో కాజ్‌వేలు నిర్మించారు. కానీ ఏడు సంవత్సరాల క్రితం వరదతాకిడికి కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాజ్‌వేలు నిర్మాణం చేపడతారని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాజ్‌వేల నిర్మాణంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

భూములను లాక్కోవద్దని దళితుల ఆందోళన

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): తమ భూములను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాల కోసం తీసుకోకూడదని పేర్కొంటూ వీర్నపల్లి మండల కేంద్రంలోని దళిత కుటుంబాలు ఆదివారం ఆందోళనకు దిగాయి. 70 ఏళ్లుగా వ్యవసాయ భూములపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ బతుకు వెళ్లదీస్తున్నామని వాపోయాయి. ప్రభుత్వం తమకు పట్టాదారు పాసు పుస్తకాలు అందించిందని వాటిపై రుణం తీసుకున్నామని పేర్కొన్నాయి. తహసీల్ అధికారులు తమ భూముల్లో సర్వే నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించేందుకు సిద్ధమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాయి. భూములు లాక్కుంటే ఆత్మహత్యే శరణ్యమని వాపోయాయి.

ఈ కార్యక్రమంలో బాధితులు పోచయ్య, శంకర్, యాకూబ్, గంగవ్వ, లచ్చవ్వ, దేవవ్వ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం

గంభీరావుపేట, ఆగస్ట్ 31 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. శనివారం బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ అంజిరెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జీ గౌరి శంకర్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, ప్రతాపరెడ్డి, వెంకన్న, మల్లయ్య, ప్రవీన్, రాజుగౌడ్, నర్సింలు, నాంపెల్లి, గణేష్, రాజిరెడ్డి, మహేష్ ప్రసాద్ కుమార్ తదితరులు ఉన్నారు.



గంభీరావుపేటలో రాహుల్‌గాంధీ క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చిత్ర పటానికి ఆ పార్టీ నాయకులు ఆదివారం పాలభిషేకం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు గిరిధర్‌రెడ్డి, గౌస్, బాబు, శ్రీనివాస్, ఎల్లయ్య, సురేందర్, గోపాల్, బుచ్చాగౌడ్, బాపురెడ్డి, బాల్‌రెడ్డి, రాములు, తిరుపతి, వెంకటేశ్, దేవయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని రాజీవ్ కూడలిలో రాహుల్ గాంధీ చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, శీల ప్రశాంత్, ఏదునూరి భాను, రంజాని నరేశ్, తాళ్ల విజయ్‌రెడ్డి, కొమురయ్యయాదవ్, కుమార్, భాను, ఆగుళ్ల రాజేశం, అంజనేయులు, రమేశ్, దీటి నర్సింలు, వెంకటేశ్, ఉచ్చిడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని మండెపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రశాంత్ మాట్లాడుతూ బీజేపీ నాయకుల తీరును ఖండించారు. రాహుల్ గాంధీ కుటుంబంపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోర లక్ష్మీరాజం, బండి పర్శరాములు, గణాది కిషన్, పరశురాములు, రాపెల్లి ఆనందం, సామల రమేష్, మోర కిరణ్, యూత్ నాయకులు ఎడ్ల తిరుపతి, బైరి వేణు, రంగు మణికుమార్, బోయిని చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాడిరైతులకు ప్రోత్సాహకాలు అందజేత

ఇల్లంతకుంట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాలకు చెందిన పాడిరైతులకు కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో అగ్రహారం మేనేజర్ రవీందర్ నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంసీసీ అసిస్టెంట్ మేనేజర్ రాజిరెడ్డి, రూట్ సూపర్‌వైజర్లు చిట్టి వెంకటరాంరెడ్డి, కత్తి బాలయ్య, గుర్రం సతీష్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్లు ఆరీఫ్, వంశీ, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇల్లంతకుంట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు చేస్తున్నందున సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ నగేష్ తెలిపారు. ఇల్లంతకుంట, సోమారంపేట, అనంతగిరి, పెద్దలింగాపూర్, చీర్లవంచ, రాంచంద్రాపూర్, రహీంఖాన్‌పేట, కందికట్కూర్ గ్రామాలలోని 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాను మధ్యాహ్నాం 12గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి పాఠశాల స్థాయి ఆటలపోటీలు

ఇల్లంతకుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 2నుండి పాఠశాల స్థాయి ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలబాలికలకు అండర్, 14, అండర్ 17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2న బాలురకు వాలీబాల్, ఖోఖో, 3న బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, 4న బాలురకు కబడ్డీతో పాటు బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు లంచ్‌బాక్స్ తెచ్చుకోవాలని సూచించారు.

బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి

ఇల్లంతకుంట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకుడు ఇచ్చిన రాహుల్‌గాంధీ కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా అనేక అడ్డంకులు ఎదురైన అసెంబ్లీలో మరోసారి 42శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టిందన్నారు. కాంగ్రెస్‌పార్టీ తీసుకున్న నిర్ణయంతో బీసీ సమాజం ఆనందంగా ఉందన్నారు.

ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

తంగళ్లపల్లి ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొక్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, ఉపాధ్యక్షులు ఈదులకంటి మహేందర్‌రెడ్డి, కోశాధికారి తుపాకుల సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

కార్యవర్గం

తంగళ్లపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సారంపల్లి మిత్రసేన యూత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. వరుసగా 8వసారి కూడా అధ్యక్షుడిగా బొనుగాని రంజిత్, ఉపాధ్యక్షుడుగా రాముల బాబు, ప్రధానకార్యదర్శి జెల్ల వెంకటేష్, ఉమ్మడి కార్యదర్శి బోనుగాని సంజిత్ , క్యాషియర్ బొద్దుల అరవింద్, అకౌంట్స్ అజయ్‌లను ఎన్నుకున్నారు. సభ్యులు పరశురాములు, రాజు, తిరుపతి, రాజు, బాబు, బాలకిషన్, అంజిత్, కళ్యాణ్, శివ సాయి, రోహిత్, ఖాదర్, అభిలాష్, శివ, మహేష్, సాయి తేజ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం గ్రామంలో రూ.లక్ష ఎస్‌డీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటును స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం మాట్లాడుతూ పల్లెల ప్రగతికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటు పడుతోందని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు రాంరెడ్డి, గౌస్, రాజేందర్, శ్రీనివాస్, భాస్కర్, రవీందర్, వెంకటేశ్, నర్సయ్య, నారాయణ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రహదారి పరిశీలన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం పదిర-రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య ఉన్న మానేరు వాగు ఉధృతికి ధ్వంసమైన రహదారిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు కోతకు గురైన రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులను కేటాయించి మరమ్మతు పనులను ప్రారంభించనుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. ప్రజలకు రవాణా కష్టాలను తీర్చేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, రాంరెడ్డి, బాబు, ఎల్లయ్య, శ్రీనివాస్, గోపాల్, బుచ్చాగౌడ్, లాల్‌మహ్మద్, రాజు, బాల్‌రెడ్డి, బాపురెడ్డి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఆదివారం పరిశీలించారు. పనుల ప్రగతి అడిగి తెలుసుకున్నారు. ఆలయం వరకు కొత్త విద్యుత్‌లైన్‌ను ఏర్పాటు చేసేలా కృషి చేయాలని సభ్యులు కోరారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు ప్రదీప్, పర్శరాములు, కిషన్, బాలాగౌడ్, నర్సింలు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గంభీరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జంగం రాజులు అనే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి రూ.5000 వేలు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి రూ.2వేలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ 50 కేజీల బియ్యం అందజేశారు.

ఉద్యోగులకు సేవలు గుర్తింపునిస్తాయి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు ఉద్యోగులు చేసిన సేవలు గుర్తింపునిస్తాయని ఆలయ ఈవో రమాదేవి అన్నారు. రాజన్న ఆలయంలో విధులు నిర్వహిస్తున్న నమిలిగొండ పవన్, తాండ్ర రామేశ్వర్‌రావులు పదవీ విరమణ కార్యక్రమానికి ఈవో ముఖ్యఅతిథిగా హజరయ్యారు. పదవీ విరమణ పొందుతున్న సిబ్బందిని ఈవో రమాదేవి, నాయకులు సన్మానించారు. యూనియన్ అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి వంశీమోహన్ ఏఈవో శ్రావణ్‌కుమార్, గోవిందుల అశోక్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఉద్యోగులు నరేందర్, బొడుసు మహేష్, వెంకన్న, భాస్కర్, గౌతం, ఆగంరావు తదితరులు ఉన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి

చందుర్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో పయనించాలని సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మై భారత్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకుడైన మెడిశెట్టి శ్రీహరిని నాయకులు సన్మానించారు. సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, నాయకులు మార్త సత్తయ్యగొట్టి ప్రభాకర్, సిరికొండ శ్రీనివాస్, పులి సత్యం, లింగాల మల్లయ్య, చిర్రం తిరుపతి, పొంచెట్టి రాకేష్, బత్తుల కమలాకర్, మార్త రాజు, గుగ్గిళ్ళ సాగర్, మెడిశెట్టి శ్రీహరి, వెంగల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఈవోను కలిసిన కాంగ్రెస్ నాయకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి నూతనంగా వచ్చిన ఈవో ఎల్.రమాదేవిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఈవోను కలిసి శాలువాతో ఘనంగా సన్మానిం చారు. ఈవోను కలిసిన వారిలో పులి రాంబాబు, ముప్పిడి శ్రీధర్, పులి రాహు ల్‌సాయి తదతరులు ఉన్నారు.

బోర్‌వెల్‌కు భూమిపూజ

వేములవాడ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నూకలమర్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోర్‌వెల్‌కు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ ఆదివారం భూమిపూజ నిర్వహించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకూర్తి పర్శరాములు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వరాములు, నాయకులు పిట్టల వెంకటేశం, మొండి మల్లయ్య, సామల్ల రాజు, ఈర్య నాయక్, పొత్తూరి నర్సయ్య, గుగులోతు భులమ్మ, సోమినేని బాలు, పాలకూర్తి సుమిత్, రోమాల బక్కయ్య, దొంతుల మల్లేష్, రోమాల ప్రశాంత్, సామల్ల రజనీకంత్ పాల్గొన్నారు.